క్లుప్తంగా

కారు, బైక్ ఢీ

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో ఓ కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, హనుమంతవాక వైపు నుంచి అడవివరం వైపు వెళ్తున్న కారు దారపాలెం వద్ద ఆదివారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుతున్న వ్యక్తి కాలు విరిగిపోయింది. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. ఆ రెండు వాహనాలు బీఆర్‌టీఎస్‌లో మధ్య లైన్‌లో ప్రయాణించడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాదంపై ఫిర్యాదు నమోదు కాలేదని ఆరిలోవ పోలీసులు తెలిపారు.

మొక్కలు నాటిన యువకులు


మొక్కలు నాటుతున్న యువకులు

బీచ్‌రోడ్డు: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు నీడ కల్పించేందుకు, ప్రాంగణంలో పచ్చని వాతావరణం నెలకొల్పేందుకు సోషల్ ఆర్పీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ముందుకొచ్చారు. వీరంతా మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటారు. వీరిని పోలీస్‌లు అభినందించారు.

దేశ ఆర్థిక పునర్వ్యవస్థీకరణపై సెమినార్


భాస్కర మోహన్‌ను సత్కరిస్తున్న ఏయూ పూర్వ విద్యార్థులు


మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏయూలోని సైన్స్ అండ్ టెక్నాలజీ భవన్‌లో ఎన్‌సీఎల్‌టీ, ఐబీసీ పాత్రపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. దేశ ఆర్థిక పునర్వ్యవస్థీకరణ, వ్యాపార నిలకడ, భారతీయ పరిశ్రమ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సెమినార్‌లో ఎన్‌సీఎల్‌టీ ముంబయి బెంచ్ మాజీ అధ్యక్షుడు భాస్కర మోహన్ ముఖ్యవక్తగా ప్రసంగించారు. కార్యక్రమంలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ డైరెక్టర్ (ఫైనాన్స్) కిరణ్ ఈశాంకరాల, వైజాగ్ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాగం కిషోర్ పాల్గొని వారి అభిప్రాయాలు వెల్లడించారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కె.వి.వి.రావు, వైస్ చైర్మన్ డాక్టర్.కె.కుమార్ రాజా, జనరల్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్, డాక్టర్ ఎస్‌కేవి అప్పారావు, వై.వి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధుల చికిత్సపై అవగాహన


శిక్షణలో పాల్గొన్న దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు

ఎంవీపీకాలనీ: ఊపిరితిత్తుల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో కీలకమైన ఈబీయూఎస్(ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్) టెక్నాలజీపై మెడికవర్ హాస్పిటల్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మెడికవర్ హాస్పిటల్స్, ఒలింపస్ మెడికల్ సిస్టమ్స్ సంయుక్తంగా దేశవ్యాప్తంగా ఉన్న పల్మనాలజీ నిపుణుల కోసం ఈ శిక్షణను నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ పల్మనాలజిస్టులు డాక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ సుధీర్ థాలే మాట్లాడుతూ మానవులను వేధిస్తున్న వ్యాధుల్లో ఊపిరితిత్తుల వ్యాధులు ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఈ సమస్యపై వైద్యుల్లో అవగాహన పెంచేందుకు ఈ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా నిపుణులు సిద్ధాంతాలు, చికిత్స విధానాలు, వినియోగాలు, ప్రాథమిక సూత్రాలను వివరించారు. కార్యక్రమంలోపలువురు వైద్యులు పాల్గొన్నారు.

వైభవంగా రాధాష్టమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్‌లో గల ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాధాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో వేకువజామున వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళహారతి, దర్శనహారతి, హరినామ సంకీర్తన, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక కుంకుమార్చన చేశారు. రాధాకృష్ణ లీలలపై ప్రత్యేక ప్రవచనాలు అనంతరం భక్తులకు విందు ప్రసాదం అందించారు.

ముసుగేసి మాయ

అక్రమ కట్టడాలతో మస్కా

- కంటికి కనిపించని కాసుల కథ నడుపుతున్న బిల్డర్లు
- పైకి రంగులేసి గుట్టుగా నిర్మాణాలు పూర్తి చేస్తున్న వైనం
- పాత వెంకోజీపాలెంలో రెండు అడుగుల రోడ్డులో మూడు అంతస్తుల నిర్మాణం
- స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ స్థలాల్లోనూ అక్రమాల అంతస్తులు
- కాసుల కక్కుర్తితో కన్నెత్తి చూడని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు


పాత వెంకోజీపాలెం ఉమానగర్ కాలనీలో ఇరుకు సందులో రంగులు వేసి లోపల నిర్మాణ పనులు చేస్తున్న భవనం

మద్దిలపాలెం: మహానగరంలో బిల్డర్లు మాయాజాలం చేస్తున్నారు. కంటికి కనిపించని కాసుల కథ నడిపిస్తూ అక్రమాల అంతస్తులు నిర్మించేస్తున్నారు. పైకి రంగులేసి... ఆపై ముసుగేసి... ఎంచక్కా నిర్మాణాలు పూర్తి చేసేస్తున్నారు. రెండడుగుల రోడ్డున్న చోట కూడా మూడంతస్తుల భవనం అక్రమంగా నిర్మించేస్తున్నారంటే ఎంతలా అక్రమ కట్టడాలతో మస్కా కొడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారనే సందేహం అందరికీ వచ్చినప్పటికీ... ఆ.. ఏముందిలే కాసులిస్తే నిబంధనలకు పాతరేసేస్తారు కదా అని సర్ది చెప్పుకుంటున్నారు. అయినప్పటికీ ఎవరైనా ధైర్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తే... ఇదే అదునుగా ఆ అక్రమ నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్ల నుంచి మరింతగా అధికారులు దోచేస్తున్నారు. ఫిర్యాదు వచ్చింది... కూల్చేస్తామంటూ సుత్తి, సేనాం, గునపాలు, గడ్డ పారలతో యుద్ధానికి వచ్చినట్లు సిబ్బందితో కలిసి అధికా**రులు దిగిపోతున్నారు. దీంతో బెంబేలెత్తిన బిల్డర్లు ముడుపులు చెల్లించుకుని అక్రమాల అంతస్తులు పూర్తి చేసేసుకుంటున్నారు. అనంతరం ఆ భవనాలను బిల్డర్లు అమ్మేసి సొమ్ము చేసుకుని చేతులు దులిపేసుకుంటున్నారు. తర్వాత ఇబ్బందులన్నీ** కొనుగోలుదారుడు పడాల్సిందే. ఇదీ విశాఖ తూర్పు నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ముసుగేసి చేస్తున్న మాయ...!!

రెండడుగుల సందులో మూడంతస్తుల భవనం

జీవీఎంసీ 15వ వార్డు పరిధి పాత వెంకోజీపాలెంలోని ఉమానగర్‌లో రెండు అడుగుల రోడ్డు గల ఇరుకు సందులో ఏకంగా మూడు అంతస్తుల భవనం నిర్మించేస్తుండడం విశేషం. డోర్ నంబరు 55 – 4 – 3 గల లైన్‌లో ఈ జీ ప్లస్ – 3 నిర్మాణాలు చేస్తున్నారు. ఇప్పటికే వీటికి పైకి రంగులు వేసేశారు. ఎవరికీ తెలియకుండా లోపల మాత్రం గుట్టుగా మిగిలిన నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇంత ఇరుకు సందులో అన్ని అంతస్తుల భవనాల నిర్మాణం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా టౌన్ ప్లానింగ్ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి సందుల్లో ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఆ సమయంలో రక్షణ చర్యలు చేపట్టాడానికి వీలు లేని పరిస్థితి. ఈ ఇరుకు సందులో భవనాల నిర్మాణంపై వార్డు సచివాలయ కార్యదర్శిని ప్రశ్నిస్తే... ఆ భవనాలకు రంగులు వేసేశారని చెబుతున్నారు. తీరా ఆ భవనాలను పరిశీ**లిస్తే లోపల నిర్మాణ ప్రక్రియ కొనసాగుతోంది. పక్కనే ఉన్న భవనాలను అనుకుని... కనీస సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేసేస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలకు అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.**

భారీ వసూళ్లతో నిబంధనలకు పాతర

హెచ్‌బీ కాలనీలో గల చాకలివీధిలో స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ స్థలాల్లో అనుమతి లేకుండానే పక్క పక్కనే రెండు అదనపు అక్రమ నిర్మాణాల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి భవనాల నిర్మాణంలో కొందరు అధికారుల చేతివాటం ఉందనే ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. బీపీ నంబర్ 1086/0680/ఈ/23/ఎంఈఎం/2025 ప్రకారం ఈ రెండు భవనాలకు జీవీఎంసీ స్టిల్స్ గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్, టెర్రస్ ఫ్లోర్, వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అనుమతిచ్చింది. అయితే అనుమతులు లేకున్నా అక్రమంగా మరో అంతస్తు నిర్మించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా తమకు తెలియదని.., ఫిర్యాదులు అందలేదని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతుండడం విడ్డూరం. తీరా ఆరా తీస్తే ఈ అక్రమ భవనాల నిర్మాణం వెనుక భారీగా వసూళ్లు జరిగాయని తెలుస్తోంది. మరోవైపు భారీ భవంతుల నిర్మాణాలకు కనీస నిబంధనలు పాటించక పోయినా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంపై అందరూ ఆశ్చర్యపోతున్నారు. జోనల్ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సెట్‌బ్యాక్ లేకుండా భవనానికి అనుకుని నిర్మిస్తున్న భవనం


ఇరుకు సందులో గల రెండు అడుగుల రోడ్డు


ఉమానగర్‌కాలనీ సందులో నిర్మిస్తున్న భవనం

పైకి రంగులేసి... గుట్టుగా నిర్మాణం

రెండు, మూడడుగుల రోడ్లున్న ప్రాంతాల్లో నాలుగేసి అంతస్తుల భవనాల నిర్మాణం నిబంధలకు విరుద్ధం. అయితే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్వాకం కారణంగా... ఆ నిర్మాణాలు మూడో కంటికి తెలియకుండా ఉండేందుకు పైన రంగులు వేస్తూ... తర్వాత దానిపైన టార్పాలిన్, లేదా క్లాత్‌తో ముసుగేసి లోపల నిర్మాణ పనులను బిల్డర్లు పూర్తి చేసేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎవరైనా టౌన్ ప్లానింగ్ సెక్రటరీని ప్రశ్నిస్తే... ఆ భవనానికి రంగులు వేసేసి... నిర్మాణం పూర్తి చేసేశారు కదా అని సమాధానమిస్తుండడం గమనార్హం. బిల్డర్లు, నిర్మాణదారులు కూడా తెలివిగా అనుమతి ఉన్నంత వరకూ పరదాలు, ముసుగులు వేయడం లేదు. అనుమతి లేకుండా అదనంగా అక్రమంగా నిర్మాణాలు చేపట్టే క్రమంలో పైన రంగులు వేసేసి... తర్వాత పరదాలు, ముసుగులు వేస్తున్నారు. చుట్టూ పరదాలు కట్టి చాటుమాటుగా నిర్మాణాలు చేపడుతూ జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలాంటి భవనాన్నే జీవీఎంసీ 23వ వార్డు పరిధి మద్దిలపాలెం చేపల బజారు వద్ద గుర్తించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమంగా వేసిన శ్లాబ్‌కు రంధ్రాలు పెట్టారు. అయితే ఇదే మాదిరిగా మద్దిలపాలెంలో గతంలో రెండు భవంతులకు రంధ్రాలు పెట్టినా..., నెల రోజులు తిరిగే లోపే ఆ భవనాల నిర్మాణాలు పూర్తి చేసేసిన నిర్మాణదారులు వాటిని విక్రయించేయడం విశేషం. ఇందంతా జోన్ – 3 కార్యాలయంలో గల టౌన్‌ప్లానింగ్ ముఖ్య అధికారి కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ కమిషనర్ అక్రమ నిర్మాణాలు గుర్తించడానికి టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసినా..., సదరు అధికారి లోపాయకారీగా వ్యవహారాలు నడిపిస్తూ తూతూమాత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులిపేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ ఎదురుగా అక్రమంగా నిర్మిస్తున్న భవనం


మద్దిలపాలెంలో అక్రమ నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు చేయించిన రంధ్రాలు

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ


అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మొల్లి అప్పారావు, తదితరులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరానగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొల్లమల్ల అప్పారావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆదివారం పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వైదా నారాయణరావు, కనకల కృష్ణ, పతివాడ వెంకటలక్ష్మి, సత్యవతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి నిర్వహించాలి

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు


సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని ఈ నెల 2న తూర్పు నియోజకవర్గంలో వాడవాడలా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతమ్మధారలో గల కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2న వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వార్డుల్లోని వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించి, అనంతరం ఉదయం 9 గంటలకు బీచ్ రోడ్డులో నిర్వహించే కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. అక్కడ నిర్వహించే శిబిరంలో ప్రతీ వార్డు నుంచి నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, పీతల గోవింద్, పీతల మహేష్, నగిరెడ్ల పోలిశెట్టి, వైదా నారాయణరావు, పిలక మధుసూదన రెడ్డి, నీరజ్ కుమార్, పతివాడ కనకరాజు, ముగడ రమేష్, మొల్లి హేమంత్, సత్యాల వెంకట్, చొల్లంగి నాగేశ్వరరావు, పలికిల నీలా రెడ్డి, ఉమ్మిడి కళ్యాణ్, వాడమొదుల గణేష్, యనమరెడ్డి కుమార్ రెడ్డి, మధుపాడ రవి, బూస రమణరెడ్డి, రవీంద్ర చౌదరి, బేతా దుర్గారావు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వినాయక మండపాలు


ఆకట్టుకుంటున్న 'ఆపరేషన్ సింధూర్' సెట్


గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనచోదకులు, ప్రయాణికులకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన వినాయక మండపాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆటోస్టాండ్ కార్మికులు ఏర్పాటు చేసిన మంచుకొండలపై శివుని ప్రతిరూపంతో రూపొందించిన సెట్ అందరినీ విశేషంగా ఆకర్షిస్తోంది. మరోవైపు గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ సెట్ ఏర్పాటు చేశారు. 2008 నుంచి ఏటా కొత్తదనాన్ని చూపిస్తూ మండపం ఏర్పాటు చేస్తున్నామని సంఘం సభ్యులు తెలిపారు.

- పాత వెంకోజీపాలెంలోని శ్రీ సీతారామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భజన చేశారు. స్థానికులు పాల్గొని భక్తి పాటలు విన్నారు.
- కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

తీరంలో కమ్మేసిన పొగ



ఏయూ క్యాంపస్: సాగర తీరంలో సాయంత్రం సరికొత్త వాతావరణం దర్శనమిచ్చింది. తేమ కమ్మేయడంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. దూరంగా ఉన్న వాహనాలు కనిపించని పరిస్థితి ఎదురైంది. గాలిలో తేమ అధికంగా ఉండటంతో తీరంలో రోడ్డు పొడవునా ఇదే రకమైన వాతావరణం కనిపించింది.

భవనం పైనుంచి పడి కార్మికురాలి మృతి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనం పైనుంచి జారిపడి కార్మికురాలు మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పీఎం పాలెం సీఐ జి. బాలకృష్ణ తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా, గుర్ల మండలం, గొలగాం గ్రామానికి చెందిన చెందక సత్యాలు (48), తన భర్త సింహాచలంతో కలిసి మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చారు. వారు ఆరిలోవలోని తోటగరువు వద్ద నివాసం ఉంటూ భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. రుషికొండలోని తారకరామ లేఅవుట్‌లో గల ఆదిత్య అపార్ట్‌మెంట్ వెనుక నిర్మాణంలో ఉన్న ఒక భవనం వద్ద వారు కూలి పనులు చేస్తున్నారు. ఆదివారం మూడో అంతస్తులో శ్లాబ్ నిర్మాణ పనులు జరుగుతుండగా, పనిలో భాగంగా పైనున్న సత్యాలు కళ్లు తిరిగి మొదటి అంతస్తు శ్లాబ్‌పై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినాయక మండపాల్లో అన్నసమారాధన


అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, తదితరులు


రాజీవ్‌నగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పలుచోట్ల నిర్వాహకులు అన్నసమారాధనలు చేపట్టారు. జీవీఎంసీ పదో వార్డు పరిధి డెయిరీఫారం సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద జరిగిన అన్నసమారాధనలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, స్థానిక నాయకులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి రాజీవ్‌నగర్, శ్రీహరినగర్, కైలాసనగర్ ప్రాంతాల్లోనూ వినాయక మండపాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఆయా చోట్ల వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొని నిర్వాహకులతో కలిసి భక్తులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఆయా కమిటీల సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

జీవీఎంసీ 16, 23వ వార్డుల్లో...

మద్దిలపాలెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 16, 23వ వార్డుల్లోని కాలనీల్లో ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, 23వ వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణ రెడ్డి, తూర్పు సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, 16వ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, ప్రదీప్, సంధ్య, శశికళ, ఫిరోజ్, నిరంజన్, మద్దిలపాలెం గ్రామ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు

ఎంవీపీ రైతుబజార్‌లో అన్నసమారాధన

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలో వినాయక చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో అన్నసమారాధన చేశారు. రైతులంతా కలిసి ప్రత్యేక గణేషుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 5 రోజులుగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, టీడీపీ నాయకుడు పట్టాభిరామ్ తదితరులు పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం సాయంత్రం అనుపోత్సవం నిర్వహించారు. రైతులంతా ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో వరహాలు, సహాయకుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.


అన్నసమారాధన ప్రారంభిస్తున్న నాయకులు

ఘనంగా తెలుగు సాంస్కృతిక ఉత్సవాలు


ప్రశంసా పత్రాలను అందిస్తున్న గజల్ శ్రీనివాస్

మద్దిలపాలెం: త్వరలో జరగనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా.. ఆంధ్ర సారస్వత పరిషత్ , కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో తెలుగు సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గాను ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. ఉత్సవాల్లో భాగంగా కర్నాటక సంగీతం, అష్టావధానం, కవి సమ్మేళనం వంటివి నిర్వహించారు. అష్టావధానంలో పాల్గొన్న పండితులను, కవి సమ్మేళనంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కవులను డాక్టర్ గజల్ శ్రీనివాస్ సత్కరించారు. చిన్నారులు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి అలరించారు. విశాఖ బీట్స్ గాయకులు సిరివెన్నెల, వేటూరి సుందరరామ్మూర్తి పాటలను ఆలపించారు. అలాగే కట్టా జేజీనారాయణ హరికథ గానం చేసి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. వరకట్న వేధింపులపై విజయనగరం మహిళా కళాకారులు ప్రదర్శించిన 'తనదాకా వస్తే' నాటిక అందరినీ ఆలోచింపజేసింది. ముగింపులో డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆలపించిన గజల్స్ ప్రేక్షకులను మైమరపించాయి. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శులు జీఆర్‌కే ప్రసాద్, చక్రవధానుల రెడ్డప్ప దవేజీ, గౌరవ సలహాదారు బాబు శ్రీ డాక్టర్ ములుసు అపర్ణ, ఉపాధ్యక్షులు కడిమెల్ల వరప్రసాద్ సహస్రావధాని, మేడికొండ శ్రీనివాస్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు వేయించుకుని.. గుర్తించరా..?

- ఎమ్మెల్యే వెలగపూడి తీరుపై జీవీఎంసీ 13వ వార్డు టీడీపీ నాయకుల ఆగ్రహం
- పదవుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని పంచగ్రామాల నాయకుల అలక
- వెలగపూడికి వ్యతిరేకంగా శ్రీకృష్ణాపురం మామిడి తోటలో సమావేశం


సమావేశమైన టీడీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు టీడీపీలో ప్రాంతాల వారీగా వర్గాలు ఏర్పడ్డాయి. ఇందులో ఓ ప్రాంతం వర్గం వారికి టీడీపీలో ప్రాధాన్యమిచ్చి మరో ప్రాంతం వర్గాన్ని పక్కన పెట్టేశారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేయించుకుని పదవులు ఇచ్చే సమయంలో పట్టించుకోవడం లేదని సదరు వర్గం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆదివారం ఓ ప్రాంతానికి చెందిన ఐదు గ్రామాల టీడీపీ నాయకులు సమావేశమై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ తీరుపై నిరసన తెలియజేశారు. పదమూడో వార్డు అటు దారపాలెం, పైనాపిల్‌కాలనీ నుంచి ఇటు దీన్‌దయాల్‌పురం, ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్ వరకు ఉంది. దీనిలో ఆరిలోవ కాలనీ, దీన్‌దయాల్ పురం, దర్గాబజార్ వరకు ఉన్న ప్రాంతంలో టీడీపీ నాయకులకు వార్డులోని పదవులన్నీ ఇస్తున్నారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు, కార్యదర్శితోపాటు ఇతర పదవులన్నీ ఈ ప్రాంతంలో టీడీపీ నాయకులకు ఇస్తున్నారు. ముడసర్లోవ పంచగ్రామాలుగా పిలిచే రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్.ఎస్.ఎస్.నగర్, పైనాపిల్‌కాలనీ, దారపాలెం గ్రామాల్లోని టీడీపీ నాయకులకు మాత్రం ఇంతవరకు పదవులు ఇవ్వలేదు. ఆయా గ్రామాల టీడీపీ నాయకులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణను ఎన్నిసార్లు అభ్యర్థించినా ఫలితం కనిపించలేదు. దీంతో విసిగిపోయిన పంచగ్రామాల టీడీపీ నాయకులు ఆదివారం శ్రీకృష్ణాపురం మామిడి తోటలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే తీరుపై నిరసన తెలియజేశారు. ఈసారి తమ ప్రాంతంలో టీడీపీ నాయకులకు వార్డులో కీలకమైన పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వార్డు అధ్యక్షుడు, లేదంటే ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చేవరకు ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకురావాలని, దీనిపై ఎమ్మెల్యేతో తాడోపేడో తేల్చుకోవాల్సిందేనని సమావేశంలో తీర్మానించారు. ఇప్పటికైనా మా ప్రాంతంలో టీడీపీ నాయకులను ఎమ్మెల్యే గుర్తించాలని కోరారు. ఎన్నికల సమయంలో మా ప్రాంతం వారి ఓట్లు వేయించుకుని... పదవులు మాత్రం వేరే ప్రాంతం నాయకులకు ఇస్తున్నారని, ఇది మా ప్రాంతంపై వివక్ష చూపడమేనని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ముడసర్లోవ పంచ గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.